జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శుక్రవారం | 24-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 227 పేజీలు: 4 వెల: రూ.7


# సచివాలయ సిబ్బంది.. ఎక్కడ?



భావనపాడు సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు




- వేళకు రాని ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు
- ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు
- పనుల కోసం గంటల తరబడి లబ్ధిదారుల నిరీక్షణ
- ఇదేంటని ప్రశ్నిస్తే.. ఫీల్డ్ అని నిర్లక్ష్యపు సమాధానం
- జాడ లేని బయోమెట్రిక్
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నేతలతో అంటకాగుతున్న కొందరు కార్యదర్శులు
- గాడితప్పిన సచివాలయ వ్యవస్థ

**సంతబొమ్మాళి, జనవరి 23 (వార్త):** గత వైసీపీ ప్రభుత్వం గ్రామ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను గ్రామాలు, వార్డుల్లో ఏర్పాటు చేసింది. అన్ని శాఖలకు సంబంధించిన పనులు అక్కడే జరిగేలా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే పలు సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియదు. ఎవరైనా అడిగితే ఫీల్డ్ అని సిబ్బంది చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ కొరవడింది. కార్యదర్శులతో సహా సచివాలయ సిబ్బంది అంతా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు చేస్తున్నారు. ఎవరూ కూడా స్థానికంగా ఉండడం లేదు. యూనిఫారం ఊసే లేదు. బయోమెట్రిక్ ఉన్నా లేనట్టే. సమయానికి ఒకరిద్దరు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు సైతం రాజకీయ నేతలతో అంటకాగడంతో వారు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తారన్న విమర్శలు ఉన్నాయి. మండల అధికారులు గతంలో సచివాలయాలను సందర్శించి సిబ్బంది దిశానిర్దేశం చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కొన్ని మండలాల్లోనే కనిపిస్తోంది.

## 11 గంటలకు.. కుర్చీలు ఖాళీ!




మీడియా బృందం సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రామ సచివాలయాన్ని గురువారం ఉదయం 11 గంటలకు సందర్శించింది. అక్కడ సచివాలయంలో సిబ్బంది పదిమందికి గాను ఒక్క మహిళా పోలీస్ మాత్రమే సమయానికి ఉన్నారు. సిబ్బంది కోసం ఏమయ్యారని ఎక్కడికి వెళ్లారని అడిగితే.. వెల్ఫేర్ అసిస్టెంట్ ఏరియా మీదకు వెళ్లారని తెలిపారు. మిగతా సిబ్బంది కోసం అడుగగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. సమయానికి సచివాలయం సిబ్బంది వచ్చి ఉంటే బయోమెట్రిక్ వేయడం, హాజరు పట్టికలో సంతకాలు పెట్టి ఉండేవారు. అక్కడ అవేవీ కనిపించకపోవడం గమనార్హం. 11 గంటలకు సచివాలయ సిబ్బంది ఇద్దరు మాత్రమే కనిపిస్తూ కుర్చీలు మాత్రం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వివిధ పనుల కోసం వచ్చిన గ్రామస్తులు సచివాలయం సిబ్బంది కోసం నిరీక్షించడం కనిపించింది. సిబ్బంది పనితీరు, విధుల తదితర వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడంతో ఇలా జరుగుతుందని పలువురు అంటున్నారు. విధులకు నిర్లక్ష్యంగా హాజరయ్యే వారి పట్ల ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సమయపాలన పాటించకుంటే చర్యలు

భావనపాడు సచివాలయంలో సిబ్బంది సమయపాలన పాటించక పోవడంపై ఎంపీడీవోను పి.జయంత్ ప్రసాద్‌ను మీడియా బృందం వివరణ కోరింది. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోయినా, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# క్రైం కార్నర్

## మహిళ ఆత్మహత్య

**శ్రీకాకుళం క్రైం, జనవరి 23 (వార్త):** శ్రీకాకుళం నగరం చిన్నబరాటం వీధికి చెందిన సప్ప కుమారి (55) తన కన్నవారి గ్రామం చిలకపాలెంలో గురువారం ఉరివేసుకొని మృతిచెందారు. ఆమె భర్త రెండేళ్ల కిందట మృతి చెందారు. ఆరోగ్యం సహకరించక చనిపోతున్నట్లు ఓ లేఖ రాశారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు లేదని ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపారు.

## మందలించారని..

సారవకోట మండలంలోని మాళువ గ్రామానికి చెందిన విష్ణు దాలన్న (58) గురువారం పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై బి.అనీల్‌కుమార్ తెలిపారు. మద్యానికి అలవాటు పడిన దాలన్నను కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపం చెంది మద్యం మైకంలో పురుగు మందు తాగినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం శ్రీకాకుళంలోని సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

## బావిలో పడి..

బూర్జ మండలం మదనాపురం శివారు తాగునీటి బావిలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఎం.ప్రవల్లిక తెలిపారు. వీఆర్వో లక్ష్మీనారాయణ అందించిన సమాచారంతో పాలకొండ అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసినట్లు చెప్పారు. చనిపోయిన వ్యక్తి వయసు సుమారు 22 సంవత్సరాలు ఉండొచ్చని, మతిస్థిమితం లేక రహదారులపై ఇటీవల సంచరించేవాడని స్థానికులు పేర్కొంటున్నారు. బుధవారం రాత్రి బావి వద్దకు నీరు తాగేందుకు వచ్చిన అందులో జారిపడినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## రైలు ఢీకొని..

పలాస మండలంలోని పలాస-పూండి రైలు నిలయాల మధ్య గురువారం చోటుచేసుకున్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావు తెలిపారు. అతని వయసు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని చెప్పారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

పొందూరు మండలంలోని లోలుగు కాలనీలో పోలీసులు బుధవారం రాత్రి దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి ఎనిమిది ద్విచక్రవాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు, రూ.10.800 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## శాలిహుండంలో దొంగతనం

గార మండలం శాలిహుండంలోని ఉనజాన రమణమ్మ ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. 14.5 తులాల బంగారం చోరీకి గురైందని గురువారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ పైడపునాయుడు దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ జనార్ధన్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు, క్లూస్ టీం సందర్శించారు. ఆ ఇంటితో పాటు చుట్టుపక్కల స్థలాల్లో ఆధారాల కోసం క్లూస్ టీం ఆరా తీసింది.

# కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

- వామపక్ష నాయకులు
- కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష

**శ్రీకాకుళం, జనవరి 23 (వార్త):** కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకంగా దశల వారీగా పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు హెచ్చరిం చారు. గురువారం కార్గో ఎయిర్‌పోర్ట్‌కు బల వంతపు భూసేకరణ ఆపాలని, సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొ రేట్ సంస్థలకు కట్టబెట్టొద్దని కోరుతూ పోరాట కమిటీ, వామపక్షాల ఆధ్వర్యంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర. వాసు అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేప ట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీ కు ఎందుకు కట్ట బెడుతున్నారని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారా దత్తం చేస్తున్నాయని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులను కార్పొరేట్ సంస్థల ఆస్తులుగా మార్చ డానికి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో మందస, వజ్రపుకొత్తూరు మండ లాల్లో 20 గ్రామాల్లో 1400 ఎకరాల భూమిని ప్రజల వద్ద నుండి బలవం తంగా గుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపిం చారు. రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరి, జీడి పంటలకు గిట్టు బాటు ధర ఇవ్వకుండా తీవ్ర దోపిడీ చేస్తుందని ఇప్పుడు భూములు కూడా దోచుకోవడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార ఆధునీకరణకు 1500 కోట్లు కేటాయించి చివరి భూము ల వరకు రెండు పంటలకు నీరు అందిస్తే ఈ జిల్లాకు 1000 కోట్ల ఆదాయం వస్తుందని తద్వారా జిల్లా అభివృద్ధి అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదని వారు ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకంగా ప్రజలు మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన దీక్షలో సిపిఎం నాయకులు బి.కృష్ణమూర్తి, పోరాట కమిటీ నాయకులు లండ రామస్వామి, జోగి అప్పారావు, చిత్త గున్నయ్య, మర్ల సంతోష్, తెప్పల గున్నయ్య, నల్ల పరుశురాం, గుం టు లోకనాథం, డి.సురేష్, డి.దానయ్య, యస్.రాజు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్ రావు, జి.సింహాచలం, టి.అజయ్ కుమార్, ప్రజాసం ఘాల నాయకులు మామిడి తులసయ్య, మామిడి మాధవరావు, హేమారావు చౌదరి, నల్ల హడ్డి, వామపక్ష నాయకులు వంకల మాధవరావు, పి.కుసుమ, కృష్ణవేణి, నీలంరాజు, భాస్కర్‌రావు, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ

**మందస, జనవరి 23(వార్త):** నూతన సంవత్సరం సందర్భంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జనవరి ఒకటిన అందిన నోట్ పుస్తకాలు, పెన్నులను మందస, బీవైఆర్ పురం ఎంపీయూపీ స్కూళ్ల విద్యార్థులకు టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమరి భాస్కరరావు, దుంకురు తిరుపతిరావు, రట్టి లింగరాజు, రాజాన మహేష్, ముడుముంచి నవీన్ కుమార్, గువ్వాడ లక్ష్మీనారాయణ, ముంజేటి చంద్రశేఖర్, దేబాషిస్ పండా, ప్రకాష్ పాణిగ్రహి, గార కృష్ణారావు, బూరగాపు శంకర్, బర్ల హరికృష్ణ, తెల్లి హరికృష్ణ, కొర్నాన మురళి, నాగేశ్వర రావు, దుంకురు బాలకృష్ణ, సారి ఢిల్లేశ్వరరావు, రత్నాల వరప్రసాద్, మంగళపాత్రో, మామిడి చిరంజీవి పాల్గొన్నారు.



# ఆర్ట్స్ కళాశాలను పరిశీలించిన నాక్ బృందం

**-అభివృద్ధికి చర్యలు చేపట్టాలని**

**కోరిన ఎమ్మెల్యే గొండు శంకర్**

**శ్రీకాకుళం, జనవరి 23(వార్త):** శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ కాలేజ్)ను నేషనల్ అక్రిడేషన్ కమిటీ (నేక్) బృందం గురువారం పరిశీలించింది. బెంగళూరుకు చెందిన నాక్ కమిటీ సభ్యులు కళాశాలలోని వివిధ విభాగాలను, కళాశాల మైదానాన్ని, భవనాలను తనిఖీ చేశారు. ఎంతో ప్రతిష్ట ఉన్న ఆర్ట్స్ కళాశాల అభివృద్ధి చెందాలంటే మరికొన్ని అదనపు భవనాలు కేటాయించాలని, ఆధునిక సదుపాయాలకు అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కమిటీ సభ్యులను కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. ఆర్ట్స్ కళాశాల నాటి నుంచి నేటివరకు అభివృద్ధి చెందిన తీరుతెన్నులను, తన హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ నాక్ బృందానికి వివరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్, రిటైర్డ్ జడ్పీ సీఈవో, విద్యావేత్త సురంగి మోహనరావు, రిటైర్డ్ సెట్ సీఈవో వి.వి.ఎన్.మూర్తి, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి తంగి మురళి పాల్గొన్నారు.



# రహదారి భద్రతా నియమాలు పాటించాలి




**శ్రీకాకుళం, జనవరి 23(వార్త):** నెహ్రూ యువ కేంద్రం, రహదారుల మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ క్లబ్ అఫ్ బెజ్జిపురం సెమినార్ హాల్‌లో రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ క్యాంపెయిన్, రోడ్ ట్రాఫిక్ వలంటీరింగ్ సపోర్ట్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ భారతదేశం రోడ్డు ప్రమాదాల మరణాల సంఖ్యలో మొదటి స్థానంలో ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని కోరారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కేవీ ఉజ్వల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మితిమీరిన వేగం ప్రమాదకరమన్నారు. యూత్ క్లబ్ అఫ్ బెజ్జిపురం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించి, బాధ్యతతో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, యూత్ క్లబ్ అఫ్ బెజ్జిపురం కోఆర్డినేటర్ మాధవి, యువతీ, యువకులు, ఎన్.వై.కె వలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

**-శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి**

**-రూ.3.20 కోట్ల రోడ్ల పనులకు శంకుస్థాపన**

**-పూల వర్షంతో పెద్ద ఎత్తున ఘన స్వాగతం**

**పలికిన అల్లాడ, పారశెల్లి గ్రామ ప్రజలు**

**నరసన్నపేట, జనవరి 23(వార్త):** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో రూ.3.20కోట్ల వ్యయంతో చేపట్టనున్న అల్లాడ వయా పారశెల్లి, రెల్లివలస బీసీ రోడ్డు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రమణ మూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రోడ్లు, కాలువలు శిథిలావస్థకు చేరాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, జలుమూరు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, నీటి సంఘ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పాడి పశువుల పెంపకంతో నిత్య ఆదాయం



**వజ్రపుకొత్తూరు, జనవరి 23(వార్త):** పాడి పశువుల పెంపకంతో రైతులకు నిత్య ఆదాయం వస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం పల్లి సారథి గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. పాడి పశువులతో నిత్యం ఆదాయం ఉంటుందన్నారు. పశు వ్యాధులకు వైద్యం అందించే నిమిత్తం ఈ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, ట్రేడర్ కోపరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మాజీ సర్పంచ్ పోతనపల్లి షణ్ముఖరావు, టీడీపీ నాయకులు విఠల్ కుమార్, శశిభూషణ్, పశు వైద్యాధికారులు రవి, మెట్ట పాపారావు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ని రమణని పరామర్శించిన కృష్ణదాస్

**పోలాకి, జనవరి 23(వార్త):** డోల గ్రామంలో ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడ్డ ఎన్ని రమణని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ముద్దాడ బైరాగినాయుడు, కణితి కృష్ణారావు, రెంటికోట త్రినాథరావు కల్లేపల్లి లక్ష్మణరావు, డోల సాయి తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



**పలాస, జనవరి 23(వార్త):** పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం సంభవించింది. గొప్పిలి నుంచి పలాస వస్తున్న పల్లెవెలుగు బస్సు ఢీకొని ద్విచక్ర వాహనంపై నుంచి వస్తున్న రెళ్ల వసంతులు తీవ్ర గాయాల పాలయ్యాడు. 108 సిబ్బంది ఘటనా స్థలం చేరుకుని, గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పీఎం ఆవాస్‌యోజన 2.0 వినియోగించుకోండి



**మందస, జనవరి 23(వార్త):** పీఎం ఆవాస్‌యోజన 2.0 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు కోరారు. మందసలోని వెలుగు కార్యాలయంలో సీఎఫ్, వీవోఏల సమావేశం ఏపీఎం పైడి కూర్మారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ సొంత స్థలం కలిగిన వారు ఆయా సచివాలయాల పరిధిలో గల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. హౌసింగ్‌కు సంబంధించి ఏ సమస్య ఉన్నా 9949256501 ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## నేడు ఆదిత్యుడి హుండీ లెక్కింపు

**శ్రీకాకుళం, జనవరి 23(వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి దేవస్థానం హుండీలను శుక్రవారం ఉదయం 8 గంటలకు తెరవనున్నట్లు ఉప కమిషనర్ భద్రాజీ తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను లెక్కిస్తామన్నారు.

## ఆదిత్యుడి అన్నదానానికి రూ.1.01లక్షల విరాళం

**శ్రీకాకుళం, జనవరి 23(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి శాశ్వత అన్నదానం పథకానికి గురువారం శ్రీకాకుళం వాస్తవ్యులు పాలిశెట్టి గౌరమ్మ రూ.1,01,000/-లు విరాళం ఆలయ సూపరింటెండెంట్ కనకరాజుకు అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్‌శర్మ, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను అందజేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

## ప్రజా ఉద్యమాలకు వేగుచుక్క వీజీకే మూర్తి

**మందస, జనవరి 23(వార్త):** సీపీఎం సీనియర్ నాయకుడు వీజీకే మూర్తి ప్రజా ఉద్యమాలకు వేగుచుక్క అని వక్తలు కొనియాడారు. మందసలోని సీఐటీయూ కార్యాలయంలో పి.దేవేంద్ర అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో వారు మాట్లాడారు. ప్రజా ఉద్యమాలకు వీజీకేమూర్తి మృతి తీరని లోటన్నారు. జిల్లా సీఐటీయూ తొలి అధ్యక్షుడిగా అనేక కార్మిక ఉద్యమాలు నడిపారని, ఉద్యోగ కార్మిక ప్రజా ఉద్యమాల ఐక్యతకి కృషి చేసిన గొప్ప నాయకుడన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.మోహన రావు, ఆర్.దిలీప్ కుమార్, మట్ట ధర్మారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మందసలో ఏపీ పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు



**మందస, జనవరి 23(వార్త):** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మందసలో గల సంఘం భవనంలోనే పెన్షనర్లు, ఫ్యామిలీ ధ్రువీకరణ పత్రాలను అందజేయడానికి చర్యలు తీసుకున్నారు. గురువారం వారి ఇళ్లకే నేరుగా వెళ్లి వార్షిక జీవిత ధ్రువపత్రాలను సంఘం ప్రతినిథులు ఆధ్వర్యంలో తీసుకున్నారు. సుమారు 80మంది పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లు తీసుకున్నామని వారు తెలిపారు. ఫిబ్రవరి 28లోగా సర్టిఫికెట్లు అందజేయాలని పేర్కొన్నారు. హైదరాబాదు, బెంగళూరుల్లో ఉన్న పెన్షనర్లకు అక్కడ నుంచి అందజేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంపోలు త్రినాథరావు, వాయలపల్లి నారాయణరావు, కొర్ల వాసుదేవరావు, గుంట కేశవరావు, శిస్టు నవీన్ చంద్ర, పి.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



### పవర్‌ప్లాంట్ ప్రాంతాలను పరిశీలించిన..
## జెన్‌కో చీఫ్ ఇంజనీర్ల కమిటీ

**ఆమదాలవలస, జనవరి 23(వార్త):** సరుబుజ్జిలి-బూర్జ మండలాల రెవెన్యూ పరిధిలో క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ స్థాపనకు గల భూ పరిస్థితులను, వాతావరణ అనుకూలతలను ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ల కమిటీ గురువారం అధ్యయనం చేసింది. వీరికి ప్లాంట్ అవశ్యకతను ఎమ్మెల్యే కూన రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శివ్వాల సూర్యం, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు అంబాల రాంబాబు, ఎలక్ట్రికల్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి నెలాఖరులోగా రెన్యువల్ చేసుకోండి

**కోటబొమ్మాళి, జనవరి 23(వార్త):** కోటబొమ్మాళి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో వ్యవసాయ రుణం తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28లోగా 7శాతం వడ్డీతో రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో మెండ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. పీఏసీఎస్ వ్యవసాయ రుణం తీసుకున్న రైతులు ఒరిజనల్ 1బీ, బయోమెట్రిక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో తీసుకొని పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చి రెన్యువల్ చేసుకోవాలన్నారు. లేకుంటే 13 శాతం అపరాధ వడ్డీతో లోన్ చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి

**మందస, జనవరి 23(వార్త):** ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి కోరారు. నరసింగపురం, కొంకడాపుట్టి సచివాలయాల పరిధిలో గురువారం శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరాలలో వ్యాధినిరోధక టీకాలు, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు వేయించామన్నారు. శిబిరానికి తీసుకువచ్చిన పశువులకు చికిత్స చేసి మందులు అందజేస్తామన్నారు. అనంతరం పాడి రైతులకు పశు పోషణలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో నరసింగపురం సర్పంచ్ గేదెల పద్మనాభం, పశు వైద్య సిబ్బంది ధర్మేంద్ర, బాలకృష్ణ, శ్రీను, సంతోషి, హరికృష్ణ, కళ్యాణ్, నేతాజీ, లక్ష్మి, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమ, మురళి, ఇంతియాజ్, పురుషోత్తం, ఎంఏవీసీ సిబ్బంది డాక్టర్ దేవి, శ్రావణి, ధరరావు, వంశీ, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు



**కోటబొమ్మాళి, జనవరి 23(వార్త):** కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్య కర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యా ర్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలను అందజేశారు. వ్యవసాయశాఖమంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు కుమారుడు తనోజ్‌నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, దేశం నేతలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, నంబాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

**పలాస, జనవరి 23 (వార్త):** వేసవికాలంలో దృష్టిలో పెట్టుకొని తాగునీరుకి ఇబ్బంది లేకుండా చూడాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుతో కలిసి 11,13,19,22, 29వ, మంచినీటి బోర్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, టిడిపి నాయకులు గాలి కృష్ణారావు, సప్ప నవీన్, కే శంకర్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీని సుందరీకరిస్తాం

**పలాస, జనవరి 23(వార్త):** పలాస మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతానని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలోని కాశీబుగ్గ మూడు రోడ్ల చౌరస్తాలో ఉన్న మేజర్ డ్రైన్ ఆధునీకరణ పనులకు శంకుస్తాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, డీఈ కనకరాజు, వార్డు కౌన్సిలర్లు బెల్లాల శ్రీనివాసరావు, సవర సోమేశ్వరరావు, టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ త్యాడి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు



**- శ్రీకాకుళంలో శ్రీశివప్రియ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు**
**- రిమ్స్‌లో రోగులకు పండ్లు, స్ట్రెచర్స్ పంపిణీ**
**- వీల్ చైర్స్, స్ట్రెచర్స్ అందజేత**

**శ్రీకాకుళం, జనవరి 23(వార్త):** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం శ్రీకాకుళంలో శ్రీ శివప్రియ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ, వీల్ చైర్స్, స్ట్రెచర్స్ అందజేశారు. రెడ్డి శివన్నారాయణ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయాల్లో పూజలు నిర్వహించి యువ నాయకుడు నారా లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్రానికి నారా లోకేష్ దిశానిర్దేశం చేసే స్థాయిలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం రిమ్స్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.షకీల, డాక్టర్ సుభాషిని, డాక్టర్ షర్మిల, డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ రమేష్‌నాయుడు పలు వార్డుల్లో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త రెడ్డి చిరంజీవి, యువ నాయకుడు రెడ్డి శివన్నారాయణ సౌజన్యంతో వీల్‌చైర్స్, స్ట్రెచర్స్ అందజేశారు. లోకేష్ జన్మదిన సందర్భంగా వీటిని అందజేయడం అభినందనీయమని రిమ్స్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ షకీల, డాక్టర్ సుభాషిని రిమ్స్ ఆస్పత్రి తరపున లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి శివన్నారాయణ యువసేన, బలగా బుచ్చు పేట, బిజెపి, టీడీపీ, జనసేన కార్యకర్తలు, కూటమి నాయకులు, శివప్రియ చారిటబుల్ ట్రస్ట్ యువత తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టీడీపీ యువనేత లోకేష్ జన్మదిన వేడుకలు

**శ్రీకాకుళం, జనవరి 23 (వార్త):** విశాఖపట్నంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖా మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తదితరులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పాలనలో లోకేష్ ఆలోచనలు ఎంత వేగంగా ఉంటాయో, సాటి మనిషికి కష్టం వచ్చిందని తెలిసినప్పుడు కూడా అదే వేగంతో స్పందించడం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. రాజకీయం అంటే ప్రజలకు సేవ చేసుకునే అవకాశం అని నమ్మే అతికొద్ది మంది రాజకీయ నేతలలో నారా లోకేష్ ఒకరని కొనియాడారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెన్నులు, నోటు పుస్తకాలు పంపిణీ

**వజ్రపుకొత్తూరు, జనవరి 23(వార్త):** రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా పలాస శాసనసభ్యులు గౌతు శిరీష మహాత్మ జ్యోతీరావు పూలే మత్స్యకార గురుకుల బాలుర పాఠశాల-అక్కుపల్లి విద్యార్థులు సుమారు 188 మందికి, పాతటెక్కలి బిసి వసతిగృహానికి చెందిన సుమారు 35 మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, జోగి రాజే శ్వరి, అరసవెల్లి ఉమామహేశ్వరరావు, కొండప్ప సురేఖ, నక్క చంద్రకళ, సూరాడ లోకనాథం, తెప్పల చాణుఖ్య, బొంపల్లి శివ, కాస చలపతి, వంక తిరుపతి, అప్పారావు, సోమేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

**-ఎంపీడీవో లోపింటి త్రినాథరావు**



**వంగర, జనవరి 23(వార్త):** గ్రామాల్లో వయోజనులను మార్చి 15కల్లా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు శిక్షకులు సూచించారు. ఎంపీడీవో లోపింటి త్రినాథరావు, పంచాయతీ విస్తరణాధికారి కెల్ల రామారావు, ఏపీఎం టి.మంగమ్మ, టీవోటీ ప్రసాదరావు ఒకరోజు శిక్షణ తరగతులు గురువారం ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు వంగర మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఉల్లాస్ అభ్యాసకులు 15 ఏళ్లు దాటిన వయోజనులకు ఏవిధంగా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలో అవగాహన కల్పించారు. అభ్యాసకులు ప్రతిరోజూ రెండు గంటలు ఆయా గ్రామాల్లో ఒక్కొక్కరు పదిమంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ధాలన్నారు. గ్రామాల్లో 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్యులను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లోని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో నిరక్షరాస్యులు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులు, ఆయాలు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్‌వాడీ హెల్పర్లు, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రతిరోజూ అంగన్‌వాడీ సెంటర్లో గానీ, కమ్యూనిటీ హాల్ లో గాని వీరిని కూర్చుండ పెట్టి 2 గంటలు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంలో నిరక్షరాస్యులుగా నమోదు కాబడిన వయోజనులకు ప్రాథమిక అక్షరాస్యత,సంఖ్యలపై అవగాహన, అభ్యాస వాచకాల ద్వారా బోధనతో పాటుగా ఆర్థిక ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో పాటు తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఉల్లాస్ పథకం లక్ష్యాలన్నారు. వృత్తి నైపుణ్య అభివృద్ధి, ప్రాథమిక విద్య, సమానత్వాన్ని అందించటంతో పాటు సంపూర్ణ వయోజన విద్య కోర్సుల ద్వారా నిరంతర విద్యను ప్రోత్సహించడం ఉల్లాస్ పథకం లక్ష్యాలని వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీడీవో అధ్యక్షతన సంబంధిత మండల శాఖల అధికారులతో మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో వ్యవసాయ అధికారి టి.కన్నబాబు, ఏపీవో ఎం.సత్యవతి, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు రజినీ, నూకాలమ్మ, మండలంలో ఎంపిక చేసిన 12 గ్రూపులకు సంబంధించి 131 మంది మహిళలు పాల్గొన్నారు.

జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## రహదారి నిబంధనలు తప్పక పాటించాలి

**మందస, జనవరి 23(వార్త):** ప్రతీ ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పక పాటించాలని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస బస్టాండ్‌లో రహదారి నిబంధనలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, అన్ని ధ్రువపత్రాలను, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే కేసులు పెడతామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.



**ఇచ్ఛాపురం, జనవరి 23(వార్త):** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను జ్ఞానభారతి స్కూల్‌లో కార్యదర్శి, సీఈఓ జోహార్ ఖాన్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. జోహార్ ఖాన్ ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి, బ్రిటిష్ వారిని గడగడలాడించి, స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసారన్నారు. రక్తం నాకు ఇవ్వండి.. స్వాతంత్ర్యాన్ని నేను తెస్తాను.. అన్న నినాదంతో జాతి యావత్తును స్వాతంత్ర్య ఉద్యమం వైపు నడిపారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చూపిన పోరాట పటిమ, ధైర్య సాహసాలు భారత దేశంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దేశం పట్ల భక్తి, అంకిత భావం నేటితరం యువత, విద్యార్థులు సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని అధ్యయనం చేయడం ద్వారా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబీ పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ట్రాన్స్ పోర్ట్ మేనేజర్ అలీమ్‌ఖాన్, వీటీ కైలాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నేతాజీ బాట యువతకు ఆదర్శం

**లక్ష్మీనర్సుపేట, జనవరి 23(వార్త):** లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు డా.ఎం.కె.మిశ్రో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోస్ చిత్ర పటానికి డా.మిశ్రో, సహోపాధ్యాయుడు టి.ఉపేంద్ర నివాళులర్పించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



**కోటబొమ్మాళి, జనవరి 23(వార్త):** దేశ సేవే జీవిత లక్ష్యంగా భావించిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అడుగుజాడల్లో యువత ముందుకు సాగాలని గాంధీజీ సేవా సమితి ప్రతినిధులు పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని గురువారం కోటబొమ్మాళిలో సంఘ సేవకులు నౌగాపు నాగరాజు, సుసరాపు సూరిబాబు, సకలాభక్తుల త్రినాథ్ ఆధ్వ ర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. గాంధీజీ సేవాసమితి కార్యదర్శి సుసరాపు సూరిబాబు మాట్లాడుతూ నేతాజీ చూపిన బాటలో యువత నడవాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ తలగాపు వెంకటరమణ మాట్లాడుతూ నేతాజీ స్వపరిపాలన కోసం బ్రిటిష్ వాళ్లను ఎదిరించడానికి ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి భారతీయ సైనికుల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్య మంలో నేతాజీ పాత్ర మహోన్నతమని చెప్పారు.ఆయన స్ఫూర్తితో యువత దేశ సేవకు అంకితం కావాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో శిరసాల శ్రీనివాస్, జామి చంద్ర శేఖర్, సీహెచ్ శ్రీను, సకలాభక్తుల శ్రీనివాస్, మూగు మురళి, బోయిన శ్రీనివాస్, కూన భాస్కర్, రఘుపాత్రుని రామారావు, మంచాల వెంకటరమణ, నౌపడ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



**వంగర, జనవరి 23(వార్త):** స్వాతంత్ర్య సమరయోధుడు ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ జయంతి వేడుకలు గురువారం వంగరలోని వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహాయోధుడు సుభాష్ చంద్రబోస్ ఆదర్శనీయులని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కనగల పారినాయుడు, ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు, ఎం.నేతాజీ, చక్రపాణి తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



**మందస, జనవరి 23(వార్త):** స్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు యస్ గణేశ్వరరావు ఆధ్వర్యంలో అయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. భారతదేశానికి స్వాత్యంత్రం తీసుకురావడంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని వారు తెలిపారు. పాఠశాల ప్రార్థన సమయంలో స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు సమక్షంలో ఆయనను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, యం.లక్ష్మణరావు, యస్.కిరణ్‌కుమార్, యస్.అబ్రహం, పి.రాంబాబు, యం. చిత్రసేను, యం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



## పలాస పరిశుభ్రంగా ఉండాలి

**మున్సిపల్ కమిషనర్ రామారావు**

**పలాస, జనవరి 23 (వార్త):** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. గురువారం ఆయన పలాస గవర్నమెంట్ ఆసుపత్రి ఏరియా, లేబర్ కాలనీ వద్ద కాలువల పూడిక తీత పనులను, కాశీబుగ్గ అన్న క్యాంటీన్ వద్ద, తిలక్‌నగర్ ఏరియాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఆసు పత్రి ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని, బ్లీచింగ్‌తో శుభ్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్స్, సూపర్‌వైజర్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**ఇచ్ఛాపురం, జనవరి23(వార్త):** బెల్లుపడకు చెందిన యు.లింగరాజుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ట్రేడ్ సెల్ కన్వీ నర్ జి.సాయి కామేష్ కోరారు. ఈ మేరకు గురు వారం ఆయన సీఐ ఎం.చిన్నం నాయుడుకు వినతిపత్రం అందజేశారు. భూ కబ్జాలకు పాల్పడుతున్న వైస్సార్సీపీ నాయకులు నుంచి రక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంగి లక్ష్మీ, బర్రి రామ్మూర్తి పాల్గొన్నారు.



## నిరుపేద రోగికి ఆర్థికసాయం

**ఇచ్ఛాపురం, జనవరి 23(వార్త):** కష్టం అనే పదం వినగానే మేము ఉన్నామని యువభారత్ సేవా ఫౌండేషన్ భరోసా కల్పిస్తున్నారు. తేలుకుంచి గ్రామం పెద్ద వీధికి చెందిన పంది పెద్దయ్య భార్య సుందరమ్మ కొద్ది రోజులుగా పక్షవాతం వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మెరుగైన చికిత్స కోసం ఆర్థిక సమస్యలతో దాతలను ఆశ్రయించారు. దీంతో వీరికి యువభారత సేవా ఫౌండేషన్ వారు రూ.10,000ల ఆర్థిక సాయం అందజేశారు.





## పోస్టుమేన్ బాలకృష్ణ సేవలు ఆదర్శం

**ఇచ్ఛాపురం, జనవరి 23(వార్త):** పోస్టుమేన్‌గా 45ఏళ్లుగా నామాల బాలకృష్ణ సేవలు ఆదర్శం అని సోంపేట సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ అన్నారు. బాలకృష్ణ పదవీ విరమణ సందర్భంగా ఎంఎస్ పల్లిలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం లక్ష్మణరావు పాల్గొన్నారు.

## సారాతో వ్యక్తి అరెస్టు.. రిమాండ్

**వంగర, జనవరి 23(వార్త):** వంగర మండలం కోతుల గుమ్మడ గ్రామంలో రాజాం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ గురువారం దాడి చేసి, బొత్స మురళి అనే వ్యక్తి వద్ద నుండి 3.6లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆయనను అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా సారా అమ్మకాలు జరిపితే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546